ఆరోగ్యకరమైన నారుతో అధిక దిగుబడులు

- జోరుగా ఖరీఫ్ నారుమడుల తయారీ పనులు
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 75 శాతం నారుమళ్లు పూర్తి



బిక్కవోలు మండలం ఊలపల్లిలో నారుమడిలో విత్తనాలు చల్లుతున్న రైతు



పెదపూడిలో తయారైన నారు మడి

పెదపూడి: ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచే కాలువల నుంచి సాగునీరు విడుదల చేసినా వర్షాభావ పరిస్థితులతో రైతులు నారుమడుల తయారీకి ఆందోళన చెందారు. గత వారం రోజులుగా వాతావరణం చల్లబడి, వర్షాలు కురవడంతో అన్నదాతలు ఖరీఫ్ వరి నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. అధిక దిగుబడులు సాధించేందుకు ఆరోగ్యకరమైన నారు అవసరమని, దానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని అనపర్తి, రంగంపేట, బిక్కవోలు, కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో ఖరీఫ్ సీజనలో 86 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లో కలిపి 75 శాతం మేర నారు మడులు, 4 శాతం మేర నాట్లు పూర్తయినట్లుగా వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆరోగ్యవంతమైన నారు పెంచడానికి సూచనలు

నాట్లు వేయటానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి 2–3 దఫాలుగా మురగ దమ్ము చేయాలి. పొలమంతా సమానంగా దమ్ము చెక్కతో చదును చేయాలి. రేగడి భూముల్లో నాట్లు వేయడానికి 2 రోజుల ముందుగానే దమ్ము పూర్తి చేసి ఆ తర్వాతనే నాట్లు వేస్తే మంచిది. నారు పోయడానికి సారవంతమైన మెరక ప్రదేశాన్నే ఎంచుకోవాలి. ఎకరం విస్తీర్ణానికి 3 సెంట్ల నారుమడి తయారు చేసుకోవాలి. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేసి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా గాడి తీసుకోవాలి. చివరలో సేంద్రియ ఎరువులు వేసి కలియ దున్నుకోవాలి. విత్తే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. శిలీంద్ర నాశనితో శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కేజీల చొప్పున చల్లుకోవాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాములు జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

నాట్లు వేసేటప్పుడు..

నారు తీసేటప్పుడు మొక్కలు లేతాకుపచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుంది. నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలి. ముదురు ఆకును నాటితే దిగుబడి తగ్గుతుంది. నాట్లు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశముంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూడాలి. బాగా మెత్తగా, బరువైన నేలల్లో దమ్ము చేసిన 2–10 రోజుల్లోపు నాట్లు వేయడం ముగించాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల బాటలు తీయటంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి అదుపులో ఉంటుంది.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



అధిక దిగుబడులు సాధించాలంటే ఆరోగ్యకరమైన నారు అవసరం. అందుకే రైతులు నారు పోసే ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పల్లంలో కాకుండా సారవంతమైన మెరక ప్రదేశంతోనే నారు పోసుకోవాలి. ఎకరం విస్తీర్ణానికి 3 సెంట్ల నారుమడి తయారు చేసుకోవాలి. అలాగే విత్తే ముందే తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి.

– టీవీఆర్ మణిదీప్, ఏఓ, పెదపూడి మండలం

క్లుప్తంగా

నేటి నుంచి కుతుకులూరులో గడప గడపకూ

అనపర్తి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని కుతుకులూరులో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కానున్నట్లు వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం గ్రామంలో సుమారు ఎనిమిది రోజుల పాటు జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

180 మందికి వైద్య పరీక్షలు



సేవలందిస్తున్న వైద్యుడు డాక్టర్ తేజో ఫణీంద్ర

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని వేదస్పైన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరాన్ని మండల సర్పంచుల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ సేవదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు ప్రారంభించారు. డాక్టర్ తేజోఫణీంద్ర, డాక్టర్ సత్యం రమేష్‌బాబు 180 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మద్దాల ప్రభాకర్ రావు, కంకటాల రమేష్, ఆసుపత్రి సిబ్బంది కుమారి, స్వర్ణ, లోకేష్, సతీష్ తదతరులు పాల్గొన్నారు.

శ్రీవారి పాదాలకు పూజలు



శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో శ్రీవారి పాదాలకు పూజ చేస్తున్న రమణరాజు

బిక్కవోలు: శ్రీభోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన శ్రీవారి పాదాలకు బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమణరాజు 41 రోజులుగా 1300 కిలోమీటర్లు కాలి నడకన పాదయాత్ర చేసి ఆదివారం బిక్కవోలు చేరుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేస్వామిలను దర్శించుకుని పూజలు చేశారు.

ఉపాధి హామీ గ్రామ సభలు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం, తొస్సిపూడి, ఆర్‌ఎస్‌పేట, మెళ్లూరు గ్రామాల్లో ఆదివారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించినట్లు ఉపాధి హామీ ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనుల ఆడిట్ నిర్వహించి వివరాల్ని గ్రామ సభల్లో తెలియజేశామన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సామాజిక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



గోకవరం మోడరన్ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ సుగుణ, వీరబాబు

గోకవరం: గ్రామంలోని ఇందిరా మోడరన్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. కాలనీలో సమస్యలను ఇటీవల స్థానికులు ఎంపీపీ సుంకర శ్రీవల్లి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వీరబాబు ఆదివారం తహసీల్దార్ సుగుణతో కలిసి ఇందిరా మోడరన్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల, డ్రైన్లు తదితర సమస్యలను గుర్తించారు. త్వరలో కాలనీ వాసులు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాలేటి రమ్యశ్రీ, రాంప్రసాద్, సచివాలయాల కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నీ



విజేతలతో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ప్రకాశం నగర్: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక త్యాగరాజ సేవ సమితి ఆడిటోరియంలో మూడు రోజులుగా హోరాహోరీగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో 12 విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు చేతుల మీదుగా నగదు బహుమతులు, మెడల్స్‌ను అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యాక్షుడు విజయ్ ప్రకాశ్, కార్యదర్శి పి.విశ్వనాథ్, జేవీవీ అప్పారెడ్డి, వీటీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి



లక్ష్మీనరసాపురంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- లక్ష్మీనరసాపురంలో సీసీ రోడ్డు ప్రారంభం

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రైల్వే గేట్ వరకు గడప గడపకూ మన ప్రభుత్వం, మండల పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.26.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పాలనను అందిస్తున్నారని చెప్పారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ కార్యక్రమంలో గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం లభిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ దాట్ల కిరణ్‌రాజు, ఎంపీటీసీ సురకాసుల శివ, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, పంచాయితీ కార్యదర్శి తాడి వెంకటకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటరమణ, శీలం శ్రీనివాస్, చిట్టేటి సత్యనారాయణ, గంజా మంగయ్యమ్మ, చిట్టిబాబు, దాట్ల జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



చక్రద్వారబంధంలో విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహిస్తున్నారు. ఎంపీపీ మండారపు సీతారత్నం, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ ఎం. వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్నలు రోజుకు రెండు, మూడు గ్రామాలు వెళ్లి, ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి విద్యార్థులకు కిట్లను అందిస్తున్నారు. ఇదే సమయంలో చదువు ఆవశ్యకతను, ప్రాధాన్యతను అర్థమయ్యేలా వివరిస్తున్నారు. వారి ఉన్నతి కోసం సీఎం జగన్ అందిస్తున్న కానుకలతో ప్రయోజకులుగా ఎదగాలని, మంచి ఆశయంతో చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.


స్వచ్ఛ పక్వాడ వాక్‌థాన్‌లో పాల్గొనండి

రాజమహేంద్రవరం సిటీ: ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించే స్వచ్ఛత పక్వాడ–2023లో భాగంగా సోమవారం నగరంలో ఓఎన్‌జీసీ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ దినేష్ కుమార్ ప్రకటించారు. ఉదయం 7 గంటలకు ఈ వాక్‌థాన్ ర్యాలీ కంబాల చెరువు పార్క్ నుంచి పుష్కరఘాట్ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ పాఠశాలలు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులతో మెగా వాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

ట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి



ట్రాలీ చక్రం కింద నలిగిపోయిన రావిపాటి దుర్గాప్రసాద్



రావిపాటి దుర్గా ప్రసాద్(పాతచిత్రం)

రాజమహేంద్రవరం రూరల్: మద్యం మత్తులో డ్రైవర్ ట్రాలీని నడుపుతూ ముందు వెళుతున్న స్కూటరిస్టును ఢీకొనడంతో బొమ్మూరు నవభారత్ నగర్‌కు చెందిన రావిపాటి దుర్గాప్రసాద్(49) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం.. ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన రావిపాటి దుర్గాప్రసాద్ ప్రస్తుతం బొమ్మూరు నవభారత్‌నగర్ బాలాజీపేట రోడ్డులో టీవీఆర్‌ప్లాజాలో నివసిస్తున్నాడు. రాజమహేంద్రవరం జాగృతి బ్లడ్‌బ్యాంక్ సమీపంలో రైస్‌స్టోర్స్ నిర్వహిస్తూ, ఉస్మానియా బిస్కట్స్ డీలర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం దివాన్‌చెరువులో స్నేహితుడి ఇంటి వద్ద ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి స్కూటర్‌పై ఇంటికి వచ్చేస్తున్నాడు. మోరంపూడి జంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఇనుప రేకుల లోడ్‌తో వస్తున్న ట్రాలీ డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా వచ్చి స్కూటర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రావిపాటి దుర్గాప్రసాద్ నడుం పై నుంచి లారీ చక్రం ఎక్కేసింది. అంత బాధలోను తన చేతులను బయటకు అందిస్తూ లాగమని ప్రాదేయపడినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు క్రేన్ సహాయంతో ట్రాలీని కదిపి అతనిని బయటకు తీసినప్పటికీ అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. ట్రాలీడ్రైవర్ మద్యం మత్తుతో ముందు కూడా ఒక వాహనాన్ని ఢీకొట్టి ఆ తరువాత దుర్గాప్రసాద్ స్కూటర్‌ను ఢీకొట్టినట్టు స్థానికులు చెబుతున్నారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ భార్య రావిపాటి పార్వతీదేవి ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మూరులో విషాదఛాయలు

రావిపాటి దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం మడికితో పాటు నివాసం ఉంటున్న బొమ్మూరు గ్రామంలోను విషాదఛాయలు అలుముకున్నాయి. దుర్గాప్రసాద్‌కు భార్య పార్వతిదేవి, ఇద్దరు మగపిల్లలు కవలలు ఉన్నారు. ఆ ఇద్దరూ పదో తరగతి చదువుతున్నారు. భర్త మృతి చెందాడన్న వార్త విన్న భార్య పార్వతీదేవి, పిల్లలను అక్కున చేర్చుకుని బోరున విలపించింది. అందరితోను నవ్వుతూ కలివిడిగా ఉండే దుర్గాప్రసాద్ ఇక లేడన్న నిజాన్ని ఆయన స్నేహితులు, తోటి అపార్టుమెంట్ వాసులు, బంధుమిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

సత్రం భూములకు కౌలు వేలం నిర్వహించాలి



రంప యర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీలు

గోకవరం: రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రానికి చెందిన 15.5 ఎకరాల మిగులు భూమికి బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రంప యర్రంపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములకు రైతు కూలీ సంఘం పోరాట ఫలితంగా గతంలో బహిరంగ వేలం నిర్వహించారన్నారు. మరో 15.5 ఎకరాల భూమి భూస్వాముల చేతుల్లో ఉందని, ఆ భూమికి కూడా వేలం పాట నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే గోకవరం మండలంలో సుమారు 300 ఎకరాలు సీలింగ్ భూమి ఉందన్నారు. దానిపై సమగ్ర విచారణ చేపట్టి నిరుపేదలకు పంచి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కె.సతీష్, సంఘ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతుల పనులు



అయ్యనగళ్లు కెనాల్ వద్ద రహదారికి మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

మధురపూడి: కోరుకొండ మండలం అయ్యనగళ్ల కెనాల్ వద్ద ఉన్న 516వ జాతీయ రహదారిలో ఆదివారం మరమ్మతుల పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ కెనాల్ వద్ద అప్రోజ్ రోడ్డు కిందకు దిగబడిపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కన కాలువ ఉండడంతో రోడ్డు జారిపోయింది. ఈ సమస్యను గుర్తించిన రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా జాతీయ రహదారి విభాగం అధికారులతో మాట్లాడారు. వెంటనే వెంటనే పనులు ప్రారంభించారు. ఈ పనులను సోమవారం రాష్ట్రస్థాయి ఇంజినీర్లు పరిశీలించి, శాశ్వత పరిష్కార నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

కడియం: ఇటీవల రిజిస్ట్రేషన్ అయిన వేమగిరి–శ్రీ గోదావరి ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్, క్లీనర్స్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం జరిగింది. వేమగిరి ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా వాసంశెట్టి గంగాధరరావు, అధ్యక్షుడిగా వాడపర్తి గోవిందరాజు నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, సెక్రటరీగా నక్కా ప్రకాష్, జాయింట్ సెక్రటరీగా కేజే శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా కేవీవీఎస్ స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వలవల రామకృష్ణ, పలివెల అర్జునరావు, ముఖ్య సలహాదారుడిగా భోగిరెడ్డి రామకృష్ణ, పలువురు సభ్యులు నియమితులయ్యారు. అనంతరం గౌరవాధ్యక్షుడు గంగాధరరావును సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా బాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక, టోర్నమెంట్ ఆదివారం స్థానిక సిటీ మున్సిపల్ కోర్ట్ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో అండర్–11 నుంచి అండర్–50 వరకూ బాలబాలికాలు, స్త్రీ, పురుషుల విభాగాల్లో పాల్గొన్నారు. విజేతలకు మెడల్స్, టీ షర్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాక్షుడు డీవీవీ త్రినాథ్, కార్యదర్శి కొత్తపల్లి బాలు, ఉపాధాక్షుడు శంకర్, కోశాధికారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీస్‌లో ఫిలాటలీ కౌంటర్

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ తపాలా శాఖ అధునాతన యుగంలో తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పలు చారిత్రక సందర్భాలను మహనీయుల జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ప్రత్యేక పోస్టల్ స్టాంపులు, తపాలా కవర్లను ఆవిష్కరిస్తూ వస్తోంది. అలా ప్రత్యేక సందర్భాలలో విడుదల చేసే స్టాంపులను ఫిలాటలీ స్టాంపులుగా పరిగణిస్తారు. అటువంటి ఫిలాటలీ స్టాంపులు, కవర్లను అమ్మకం సాగించేందుకు హెడ్ పోస్టాఫీసులో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ పి. కోమల్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. చారిత్రాత్మక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సంగీత సాహిత్య, క్రీడా పరమైన, వన్య ప్రాణులకు, పక్షి జాతులకు సంబంధించిన అపురూపమైన, అత్యంత విలువైన ఫిలాటలీ స్టాంపులను, ప్రత్యేక తపాలా కవర్లను 10, 11 తేదీల్లో రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయంలో విక్రయించనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఫిలాటలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నర్సరీ ఎన్నికలకు 13 నామినేషన్లు



కడియపులంకలో నామినేషన్లు పరిశీలిస్తున్న ఎన్నికల కమిటీ సభ్యులు

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఎన్నికకు ఆదివారం 13 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల కమిటీ తెలిపింది. అధ్యక్ష స్థానానికి నాలుగు, డైరెక్టర్ల స్థానానికి 9 నామినేషన్లను వేశారన్నారు. నర్సరీ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో ఎన్నికల కమిటీకి ఔత్సాహిక అభ్యర్థులు తమ నామినేషన్లను అందజేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకూ సమయం ఉందని మరిన్ని నామినేషన్లు దాఖలవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అభ్యర్థులు మల్లు పోలరాజు, రత్నం అయ్యప్ప, రత్నం దొరబాబు, పెనుమాక బుల్లికొండయ్యలు తమతమ అనుచరులతో భారీ ఎత్తున తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. సాధారణ ఎన్నికలను తలపించేలా జన సమీకరణ చేయడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అందరూ అభ్యర్థుల వెంట నామినేషన్ల ఘట్టంలో ఉండడం అసోసియేషన్ ఎన్నికల్లో ఫలితంపై మరింత ఆసక్తిని పెంచుతోంది. నామినేషన్ల దాఖలుకు సోమవారం ఆఖరు తేదీ కావడంతో రాజకీయాలకు అతీతంగా ఎన్నికలుంటాయా? లేకపోతే రాజకీయ ముద్రతోనే ఎన్నికలు జరుగతాయా? అన్నది తేలుతుంది.

అడ్డురాని అష్టమి..

నర్సరీ పాలకవర్గం ఎన్నికల నామినేషన్‌లకు రెండు రోజులు సమయం ఇచ్చారు. ఆది, సోమవారాల్లో నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని షెడ్యూల్‌ను ప్రకటించారు. అయితే సోమవారం అష్టమి నేపథ్యంలో నామినేషన్లు అన్నీ ఆదివారమే దాఖలవుతాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. కానీ అందుకు భిన్నంగా కేవలం 13 నామినేషన్లు మాత్రమే తొలిరోజు దాఖలయ్యాయి. 1, 4 వార్డులకు సంబంధించి ఒక్క నామినేషన్ కూడా తొలిరోజు దాఖలు కాలేదు. ఈ వార్డులతో పాటు, అన్ని వార్డుల్లోనూ పోటీకి ఆసక్తి చూపించే వారు అష్టమిని కూడా కాదని సోమవారమే తమ తమ నామినేషన్లు దాఖలు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

సూర్యదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవరులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఉదయం స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక వ్రతాలు చేయించుకున్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నరసన్న ఆలయానికి భక్తుల తాకిడి

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. ఉదయమే భక్తులు స్వామివారి దర్శంచి పూజలు చేశారు. తూర్పు, అమలాపురం, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ప్రముఖులు వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు నిత్యాన్నదానంలో అందిస్తున్నర్న అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా మోదకొండమ్మ జాతర



మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామదేవత మోదకొండమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం కొనసాగాయి. రాత్రి అమ్మవారి ఆలయం వద్ద సాయి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం అందరినీ అలరించింది. ఈ ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. సోమవారం రాత్రి గరగ నృత్యం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

మగ్గం వర్కులో ఉచిత శిక్షణ



మగ్గం వర్కులో శిక్షణకు మెటీరియల్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

రాజానగరం: ఫరిజల్లిపేటలో పేదింటి మహిళలకు మగ్గం వర్కులో ఇచ్చే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకర వెంకటేశ్వరరావు ప్రారంభించారు. దివాన్‌చెరువుకు చెందిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణలో 50 మంది మహిళలు పాల్గొంటున్నారు. ప్రతి సోమ, గురు వారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఇచ్చే ఈ శిక్షణకు బొంతల లత శిక్షకురాలుగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వరరావు, వినీల, నాగమణి, కృష్ణవేణి, సత్య, మీనా, తదితరులు పాల్గొన్నారు.